# చెత్తబుట్టలో వేస్తాడా!

- ఎం.సి. ఆంజనేయులు

ఓ వరదనీటి మళ్ళింపు పథకం రిపోర్ట్ అర్జంటుగా తయారు చేయవల్సి వచ్చి, ప్రిలిమినరీ ఇన్వెస్టిగేషన్ చేసుకురమ్మని, ఓ కుగ్రామానికి నన్నూ, నా వెంట ఓ మేస్త్రీని పంపాడు మా ఏయీ.

అప్పుడే సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ తీసుకొని ఉద్యోగంలో ఆయన కింద జేయీగా చేరిన నాకు, ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్ చేసేందుకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం వుంది. కానీ, కూలీలను మాట్లాడడం - వాళ్ళకి పనులు నిర్దేశించడం - క్షేత్రంలో సర్వే నంబర్లు గుర్తించేందుకు గ్రామ కరణాల సహాయం అర్థించడం - వంటి పనులు నాకు కొత్త. అనుభవం వున్న మేస్త్రీ నాతో పాటూ వుండడం వల్ల, పని సులభమయింది. పది రోజులు పడ్తుందనుకొన్న పనిని వారం రోజులలో పూర్తిచేసి, తిరుగు ముఖం పట్టాము.

సర్వే క్యాంపులో ఎంప్లాయ్ చేసుకున్న కూలీలకు నా స్వంత డబ్బు లిచ్చాను. ఆ డబ్బులు తిరిగి నాకు ముట్టేదెలా?!

హెడ్ క్వార్టర్స్ చేరుకున్నాక, మేస్త్రీతో ఈ విషయమై ప్రస్తావించాను. ఆ మేస్త్రీ - ఆ సాయంత్రమే మరో జేయీతో ఇంకో ప్రదేశానికి వెళుతున్నాడు.

"ఏముంది సార్! హెడ్ గుమస్తాగారి వద్ద ఎన్. ఎం. ఆర్. ఫారాలు వున్నాయ్. ఓ ఫారం తీసుకోండి. ఫారం నింపి ఏయీగారి కివ్వండి. వారం తిరక్కముందే మీ డబ్బులు మీ జేబులో వుంటాయ్!" అంటూ, 'తారక మంత్రం' ఉపదేశించి నిష్క్రమించాడు.

గుమస్తాని కలిసాను. నాకేదో పెద్ద ఫేవర్ చేస్తున్నట్టు ఫేస్ పెట్టి ఓ ఫారం నా చేతిలో పెట్టాడు, ఆయన.

ఫారాన్ని తెచ్చి కాసేపు అధ్యయనం చేసాను. తర్వాత, నా డైరీ లోంచి కూలీల పేర్లూ, వాళ్ళు పన్చేసిన రోజులకు, నిర్ణయించిన రేటు ప్రకారం, ఒక్కొక్కరికి రావల్సిన డబ్బు - లెక్కకట్టి, ఫారం నింపి, నీట్‌గా దాన్ని తీసికెళ్ళి ఏయీ కిచ్చాను.

ఆయన ఫారాన్ని అందుకుని - అలా ఇలా చూసాడు. ఆనక నా వంక ఎగాదిగా చూసాడు. ఏమనుకున్నాడో ఏమో ఫారాన్ని పిచ్చిగా నలిపి, మట్టికొట్టుకొని ఓ మూల వున్న వేస్ట్ పేపర్ బుట్టలోకి విసిరికొట్టాడు.

ఎంత పరాభవం!! కోపమో దుఃఖమో తెలియదు కానీ, నా కళ్ళ కొలకుల్లో నీళ్ళు నిలిచాయ్.

వెంటనే, ఏయీ నాకేసి చూస్తూ, నవ్వుతూ అన్నాడుః

"గుడ్... వెరీగుడ్. డిపార్ట్‌మెంట్‌కి కొత్తవాడివయినా, ఫస్ట్ టైమే, ఒక్క తప్పు లేకుండా, ఫారం ఫిలప్ చేసావ్. కానీ బేసిక్స్ మర్చిపోయావ్.

"చూడు మిస్టర్! వారం రోజులు ఆ పల్లెటూర్లో, నీ సర్వే పుస్తకంలోనో, నీ జేబులోనో నీతో కాపురం చేసిన ఫారంలా ఉందా ఇదీ! ఊహూఁ. ప్రతిదినం పనికి నియమించుకున్న కూలీల హాజరూ - పనికి ఆబ్సెంట్ అయిన కూలీల గైరు హాజరు - ఎప్పటికప్పుడు రికార్డ్‌చేసే - దినకూలీల తొలిపట్టిక - నామినల్ మస్టర్ రోల్ - అదే - ఎన్. ఎం. ఆర్. మరి అలా వుందా నువ్విచ్చిన ఫారం!?

"ఫీల్డ్ వర్క్ చేసేటప్పుడు నీ చేతులకుండే మురికి, దానికక్కాడా - ఇంతో అంతో అంటనివ్వకుండా ఎలా వుంటావ్? ఇంత నీట్‌గా, ఫ్రెష్‌గా వుంటే - చూసే వాళ్ళు ఏమనుకుంటారు? మేకప్ చేసావని అనుకోరూ! అందుకే నేనా ఫారాన్ని అలా చేసాను."

బుట్టలోకి వంగి, ఎన్. ఎం. ఆర్. ఫారాన్ని బయటికి తీసి, దానిమీద తన పొట్టి సంతకం చేసి - పాస్ ఆర్డర్ వేసి, పుటప్ చేయమని హెడ్ క్లర్క్‌కి పంపాడు ఫారాన్ని.

అమ్మ-ఫారమా! నీ కింత 'మురికి' కథ వుందా అనుకున్నాను.